


షణ్ముఖ
SHANMUKHAVELUGU
RNI : APTEL / 2023 / 89152
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక




సంపుటి : 3 సంచిక : 136
ఆదివారం 24 మే 2026 పేజీలు 8 వెల : రూ.3
Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## కట్టుదిట్టంగా రీ-నీట్ నిర్వహిస్తాం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)

నీట్ (యూజీ)- 2026 పరీక్షలో అక్రమాలు జరిగినట్టు గుర్తించాక ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పలేదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క విద్యార్థీ "పరీక్ష మాఫియా" ఆగడాల కారణంగా సీటు కోల్పోకూడదనే దృఢ నిశ్చయంతో అధికారులు ఈ నిర్ణయాలు తీసుకున్నారని ఆయన స్పష్టం చేశారు. "ఈ వివాదానికి సంబంధించి మేం విమర్శలను, సవాళ్లను ఎదుర్కొంటున్నాం. నేనది అంగీకరిస్తున్నాను. వ్యవస్థను బాగుపరచడం మా బాధ్యత. సమస్య పట్ల కళ్లు మూసుకొని ఎటో చూడటం మా పని కాదు. వచ్చే నెల 21న తిరిగి నిర్వహించనున్న నీట్ (యూజీ) పరీక్షలో తప్పిదాలకు 100 శాతం ఆస్కారం లేకుండా ▶మిగతా 2లో

## బాధ్యతగా పని చేయలేరా?

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)

'రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కూడా ముందుకు తీసుకువెళ్లలేరా? నిర్దేశిత సమయంలో బాధ్యతగా పని చేయకపోతే ఎలా' అని అటవీశాఖ అధికారులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీన్ కవర్ 50 శాతం పెంచడానికి వారం రోజుల్లో ఏపీ గ్రీన్ సొసైటీ ఏర్పాటు చేయాలని.. విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. చైనా, జపాన్, సింగపూర్ తదితర దేశాల్లో పట్టుబడిన ఏపీకి చెందిన ఎర్రచందనాన్ని కేంద్ర పర్యావరణ, అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ దేశానికి తిరిగి రప్పించే ప్రక్రియ ఎంత వరకూ వచ్చిందని ప్రశ్నించారు. ▶ 2లో



## మంచోడినంటూ జగన్ సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నాడు
### పయ్యావుల ఫైర్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)

తనకంటే మంచోడు లేడంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ 'సెల్ఫ్ సర్టిఫికెట్లు' ఇచ్చుకోవడం విడ్డూరంగా ఉందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా ఎద్దేవా చేశారు. జగన్ ఎన్నటికీ బాధితుడు కాదని, ఆయనో నేర చరిత్ర కలిగిన నిందితుడని సంచలన ఆరోపణలు చేశారు. తనపై జరిగిన క్రిమినల్ చర్యలను కప్పిపుచ్చుకునేందుకే జగన్ శాంతిదూతలా నటిస్తున్నారని విమర్శించారు. శనివారం విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ, బీజేపీ నేతలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**జగన్‌ది నేర చరిత్ర.. ఫ్యాక్షన్‌కు ఆద్యులు వారే**

ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, "జగన్ బెంగళూరు ప్యాలెస్ నుంచి ఏపీకి వచ్చినప్పుడల్లా కొత్త వాదనలు తెరపైకి తెస్తారు. నిన్నటికి నిన్న ప్రెస్ మీట్ పెట్టి తనకంటే ఉత్తముడు, మంచోడు లేడంటూ సొంతంగా సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. సొంత బాబాయ్ వివేకాపై ▶మిగతా 2లో

# మహానాడు పండుగలా జరపాలి..



- అందరం కలిసికట్టుగా పనిచేయాలి
- ఈ నెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు
- క్లస్టర్ల స్థాయిలో వర్చువల్‌గా హైబ్రిడ్ పద్ధతిలో నిర్వహణ
- 'స్త్రీ శక్తి మహానాడు' థీమ్‌తో కార్యక్రమాలు
- పార్టీ శ్రేణులను ఏకం చేసి, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని లోకేశ్ పిలుపు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడును ఈసారి క్లస్టర్ల స్థాయిలో ఒక పండుగ వాతావరణంలో, కలిసికట్టుగా విజయవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. హైబ్రిడ్ విధానంలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు సన్నాహకాలపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ ఇంఛార్జ్‌లతో ఆయన ఆన్‌లైన్ ద్వారా సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈసారి మహానాడును 'స్త్రీ శక్తి మహానాడు' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**హైబ్రిడ్ విధానంలో నిర్వహణ :** వాస్తవానికి ఈసారి మహానాడును నెల్లూరులో అత్యంత ఘనంగా మూడు రోజుల పాటు నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ఇంధన పొదుపు చర్యలు చేపట్టాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునకు స్పందించి, ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడును రెండ్రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు లోకేశ్ వివరించారు. ▶మిగతా 2లో

## భారత్‌లో అడుగుపెట్టిన అమెరికా విదేశాంగమంత్రి... ఇరాన్ చురక

భారతీయల నుంచి సభ్యత నేర్చుకోవాలని వ్యాఖ్య

భారతీయులలో మర్యాద కనిపిస్తుందన్న ఇరాన్

ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం పోస్టు



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 23)

భారతీయుల నుంచి సభ్యత, మర్యాద నేర్చుకోవాలని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియోకు ఇరాన్ సూచించింది. నాలుగు రోజుల భారత పర్యటన నిమిత్తం మార్కో రుబియో ఢిల్లీకి చేరుకున్న సమయంలో, ఇతరులతో (ఇతర దేశాలతో) ఎలా మెలగాలో భారతీయుల నుంచి నేర్చుకోవాలని ఇరాన్ చురక అంటించడం గమనార్హం. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను మెరుగు పరిచేందుకు పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి రుబియో మన దేశంలో పర్యటిస్తున్నారు. ఆయన భారత్‌లో అడుగు పెట్టిన నేపథ్యంలో, ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. భారతీయులలో సభ్యత కనిపిస్తుందని, భారత్‌లో పర్యటిస్తున్న మీరు వారి నుంచి కొంచెమైనా నేర్చుకోవాలని వ్యంగ్యాస్త్రాలు విసిరింది. తన పర్యటనలో భాగంగా మార్కో రుబియో ▶మిగతా 2లో

## ఆదాయ లక్ష్యాలను అందుకోవాలి


అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఉత్తమ్, భట్టి, శ్రీధర్‌బాబు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)

పన్ను ఎగవేతల వంటి లీకేజీలను అరికట్టి, బడ్జెట్ ఆదాయ లక్ష్యాలను అందుకోవాలని ఆదాయ వనరుల సమీకరణ మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. దీనికి ఉపసంఘం సభ్యులు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలో అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై మంత్రుల బృందం అధికారులతో కలిసి సమీక్షించింది. ఈ సమావేశంలో భట్టి మాట్లాడుతూ.. "ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరులను సమకూర్చుకోవడంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ముందస్తుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారం అన్ని శాఖలు ఆదాయాన్ని పెంపొందించేందుకు శ్రమించాలి. ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల ఉన్నతాధికారులు ▶మిగతా 2లో



## ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో భేటీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, మే 23)

నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో.. ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. సేవా తీర్థ్ (పీఎంవో)లో సుమారు గంటకు పైగా వీరి భేటీ కొనసాగినట్లు సమాచారం. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో ఇరు దేశాల సహకారాన్ని మరింత పెంపొందించడంపై చర్చలు జరిపినట్లు భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ▶మిగతా 2లో

## అక్రమంగా ఓట్ల తొలగింపును అడ్డుకుంటాం
### టీపీసీసీ చీఫ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)



ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) పేరిట అక్రమంగా ఓట్లను తొలగించాలని చూస్తే అడ్డుకుంటామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో 31 లక్షల ఓట్లు చేర్చి.. 93 లక్షలు తొలగించారన్నారు. ఇటీవల ఆ రాష్ట్రంలో టీఎంసీ 30 లక్షల ఓట్ల తేడాతోనే ఓడిందని చెప్పారు. తెలంగాణలో ధాన్యం దిగుబడి పెరగడంతో.. కొనుగోళ్లలో కొంత జాప్యమైందని పేర్కొన్నారు. తన పనితీరును ▶మిగతా 2లో

## సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)



'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు అభిషేకాలా?సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు."అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి" అని సీఎం అన్నారు.

**రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికి ఏఐ డాక్టర్ :** ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ▶మిగతా 2లో



## రైతు గోస.. భాజపా భరోసా

అన్నదాతల సమస్యలపై 25 నుంచి పోరు..

నితిన్ నబీన్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

'బ్రేక్ ఫాస్ట్' సమావేశంలో పార్టీ నేతల కార్యాచరణ ప్రణాళిక

మాట్లాడుతున్న రామచందర్‌రావు. చిత్రంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అభయ్ పాటిల్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,మే 23)

పండించిన ధాన్యం అమ్ముకోలేక రైతులు కల్లాల్లోనే పడిగాపులు కాస్తున్నారని.. వారి పక్షాన పోరాడేందుకు భాజపా రాష్ట్ర విభాగం నిర్ణయించిందని పార్టీ నేతలు వెల్లడించారు. శుక్రవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు నేతృత్వంలో భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు 'బ్రేక్ ఫాస్ట్' సమావేశంలో పాల్గొన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అనంతరం పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. "రాష్ట్రంలో కర్షకుల సమస్యలపై పోరాడేందుకు 'రైతు గోస.. భాజపా భరోసా' పేరుతో ఈ నెల 25 నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు నేతృత్వంలో మూడు రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుంది. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ▶మిగతా 2లో

## సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవేశం పై అవగాహన కల్పించిన అధికారులు







(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 23)

మండలంలోని కలజువ్వలపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం పనుల్లో నిమగ్నమై ఉన్న సుమారు 270 మంది కూలీలకు, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా, వసతి సౌకర్యాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం, మార్కాపురం జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ లక్ష్మా నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని కూలీలకు దిశానిర్దేశం చేశారు.

సాంఘిక సంక్షేమ వసతి గృహాల విశిష్టతలు

ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం సాంఘిక సంక్షేమ వసతి గృహాల ద్వారా అద్భుతమైన సౌకర్యాలను కల్పిస్తోంది.


విద్య : 3వ తరగతి నుండి పీజీ వరకు చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం.ఆధునిక సౌకర్యాలు:విద్యార్థుల కోసం అన్ని వసతులతో కూడిన ఆధునిక భవనాలు.

వైద్యం : విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, క్రమం తప్పకుండా 'మెడికల్ చెకప్స్' నిర్వహించడం.

పోషకాహారం : రుచికరమైన పౌష్టికాహారంతో కూడిన భోజన వసతి.

అత్యుత్తమ ఫలితాలు : వసతి గృహాల్లో చదివే విద్యార్థులు పదవ తరగతి , ఇతర పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారు.పిలుపు:కూలీలు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారిని ఈ వసతి గృహాల్లో చేర్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్ లక్ష్మ నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో బేస్తవారిపేట ఏఎస్డబ్ల్యూఓ రామకృష్ణరెడ్డి, తర్లుపాడు హెచ్డబ్ల్యూఓ వెంకట్‌రెడ్డి, కొనకనమిట్ల మండల వెల్ఫేర్ అసిస్టెంట్స్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటకాశయ్య, గ్రామ పెద్దలు, పి యోహాన్, స్థానిక నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

## మండలంలో ట్రాన్స్ఫార్మర్ చోరీ




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, మే 23)

మండలంలో విద్యుత్ ట్రాన్స్ఫర్మర్ దొంగలు రెచ్చిపోతున్నారు. మండలంలోని వెంకుపాలెం బిఎస్ఎన్ఎల్ టవర్ దగ్గర, చెన్నుపాడు అడ్డరోడ్డు దగ్గర శనివారం తెల్లవారుజామున ట్రాన్స్‌ఫార్మర్ చోరీ చేశారు. దొంగలు సులభంగా విద్యుత్



కనెక్షన్ తప్పించి ట్రాన్స్ఫర్మర్లోని కాపర్ వైర్లను వేరుచేసి పట్టకెళ్లిపోతున్నారని చెబుతున్నారు. ఒక్కొక్క ట్రాన్స్ఫర్ విలువ 40 వేల రూపాయలు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారి కే వీరాంజనేయులు తెలిపారు. స్థానికులు సమాచారం అందించడంతో విద్యుత్ శాఖ అధికారి సంఘటన చేరుకొని చోరీకి గురైనట్టు తెలుసుకొని ఎస్ఐ సత్యనారాయణకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేశారు.

## మొదటి పేజీ తరువాయి

## మహానాడు పండుగలా జరపాలి..

దీని ప్రకారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగే ప్రధాన కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 1,875 క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్‌గా మహానాడు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్‌ఈడీ టీవీ, స్పీకర్లు వంటి సాంకేతిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

క్లస్టర్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

ఈ మహానాడును క్లస్టర్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి ఒక మంచి అవకాశంగా ఉపయోగించుకోవాలని లోకేశ్ అన్నారు. "క్లస్టర్ ఇంఛార్జ్‌లకు ఎక్కువ బాధ్యత ఇవ్వాలన్నది పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశం. ఈ వ్యవస్థ ద్వారానే మనం ముందుకు వెళ్లాలి" అని ఆయన పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలోని కుటుంబ సాధికార సారథి (కేఎస్ఎస్) నుంచి బూత్ ఇంఛార్జ్‌లు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యుల వరకు అందరినీ ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆదేశించారు. హాజరును 'మై టీడీపీ' యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న తరుణంలో, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందని లోకేశ్ గుర్తుచేశారు. ఇందుకు మహానాడును ఒక వేదికగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీలో వ్యక్తులు శాశ్వతం కాదని, వ్యవస్థే శాశ్వతమని, ఆ వ్యవస్థను పటిష్ఠం చేసేందుకే క్లస్టర్ ఇంఛార్జ్‌లకు అవకాశం కల్పించామని అన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని, వారి పనితీరును 'మై టీడీపీ' యాప్ ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లతో సమన్వయం చేసుకుంటూ, ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి మహానాడును చారిత్రాత్మక విజయంగా నిలపాలని ఆయన కోరారు.

ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లు, జోనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## కట్టుదిట్టంగా రీ-నీట్ నిర్వహిస్తాం

చూసేందుకు మా ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది" అని ఆయన అన్నారు. శుక్రవారం జరిగిన జాగరణ్ భారత్ విద్యా సదస్సులో ఆయన ప్రసంగించారు. "దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు వైద్య విద్య ప్రవేశ పరీక్షకు సంబంధించిన వివాదం కారణంగా మానసిక క్షోభను అనుభవించారు. వ్యవస్థను బాగు చేయడానికి ప్రభుత్వం కంకణ బద్ధమై ఉంది" అని మంత్రి పేర్కొన్నారు. రద్దైన నీట్ పరీక్ష ఫీజును తిరిగి పొందేందుకు అభ్యర్థులు ఈ నెల 27 వరకు ప్రత్యేక పోర్టల్ ద్వారా బ్యాంకు వివరాలు సమర్పించాలని అధికారులు తెలిపారు.నీట్ కేసులో మరో లెక్చరర్ అరెస్టు నీట్ ఫిజిక్స్ ప్రశ్నపత్రాన్ని లీక్ చేసిన ఆరోపణలపై పుణెకు చెందిన లెక్చరర్ మనీషా సంజయ్ హవల్దార్‌ను సీబీఐ శుక్రవారం అరెస్టు చేసింది. పుణెలోని శేఠ్ హీరాలాల్ సరాఫ్ కళాశాలలో పనిచేస్తున్న మనీషాను ఎన్‌టీఏ నిపుణురాలిగా నియమించిందని, నీట్ ప్రక్రియలో కూడా ఆమె పాల్గొన్నారని దర్యాప్తు సంస్థ పేర్కొంది ఇప్పటి వరకూ ఈ కేసులో 11 మంది నిందితులు అరెస్టయ్యారు.

## రైతు గోస.. భాజపా భరోసా

ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులో రైతుల వద్దకు వెళ్లి వారి పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారు. ఇంతవరకు 24 శాతం ధాన్యమే కొనుగోలు చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. మక్కలు, జొన్నలు పెద్దఎత్తున కొనుగోలు చేయాల్సి ఉంది. సీఎం రేవంత్ రైతులకు హామీలిచ్చి పట్టించుకోవడం లేదు" అని మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు.

'సర్'పై అవగాహన కల్పించాలి..

సమావేశంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)పైనా చర్చ జరిగింది. 'సర్'పై కాంగ్రెస్ నేతలు లేనిపోని అనుమానాలు రేకెత్తిస్తున్నారని, వీటిపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించేందుకు భాజపా నేతలు కృషి చేయాలని రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లో చాలామందికి రెండు మూడు ఓట్లున్నాయని... అలాంటి వాటిని గుర్తించి ఏరివేసే కార్యక్రమమే 'సర్' అని అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు.భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ జూన్ మొదటివారంలో రాష్ట్రానికి రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నేతలు నిర్ణయించారు. తెలంగాణలో అధికారం చేపట్టడమే లక్ష్యమని ప్రధాని దిశానిర్దేశం చేశారని.. ఇందుకు భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి..నితిన్ నబీన్ సమక్షంలో వెల్లడించాలని చర్చించారు. భాజపా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, ఎంపీలు రఘునందన్, అర్వింద్, మండలి పక్ష నేత ఏవీఎన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## బాధ్యతగా పని చేయలేరా?

నిర్దేశిత కార్యక్రమాల్ని ముందుకు తీసుకెళ్లడంలో, అటవీ భూముల పరిరక్షణలో బాధ్యతగా పనిచేయని కొందరు అధికారులపై మండిపడ్డారు. 'వనజీవి రామయ్య, దుశర్ల సత్యనారాయణ లాంటి పర్యావరణ ప్రేమికులు తమ జీవితాల్ని అర్పించి అద్భుతాలు సృష్టించారు. ఒంటరిగా వారే అంతటి హరిత విప్లవాన్ని సాధించినప్పుడు, ఒక వ్యవస్థగా మనం ఎంత చేయాలి?' అని ప్రశ్నించారు.

సజ్జల కుటుంబం ఆక్రమించుకున్న భూమిని వెనక్కి తీసుకొచ్చాం

'ఎంత అటవీ భూమి కబ్జాకు గురైంది, దానిలో ఎంత స్వాధీనం చేసుకున్నారు, ఎవరెవరిపై కేసులు నమోదు చేశారో అటవీ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. ఇటీవల చిత్తూరు జిల్లా మంగళం అడవుల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఆక్రమించినట్లు గుర్తించిన భూమిని స్వాధీనం చేసుకున్నాం. కడప జిల్లాలో సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబం ఆక్రమించుకున్న అటవీ భూమినీ వెనక్కి తీసుకొచ్చాం' అని పవన్ చెప్పారు. 'ఇతర ప్రాంతాల్లో కూడా ఆక్రమించుకున్న అటవీ భూములను అధికారులు స్వాధీనం చేసుకోవాలి. కబ్జాదారులపై కేసులు పెట్టాలి. అటవీ భూముల రక్షణకు జియోట్యాగ్ స్పేషియల్ సర్వే నిర్వహించాలి. అటవీ సరిహద్దుల పర్యవేక్షణకు కర్ణాటక మోడల్‌ను అనుసరించాలి. అటవీ ప్రాంతంలో ఎక్కడైనా చట్టవిరుద్ధంగా భూమిని ఆక్రమించుకున్నా, చెట్టు నరికినా.. క్షణాల్లో అధికారులకు తెలిసేలా శాటిలైట్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి' అని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

పచ్చదనం పెంచేందుకు 2.5 కోట్ల విత్తన బంతులు

స్వచ్ఛ, పచ్చని ఏపీ నిర్మాణమే లక్ష్యంగా అటవీశాఖ 2.5 కోట్ల విత్తన బంతుల తయారీ చేపట్టనుంది. ప్రజాప్రతినిధులు, పొదుపు మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వాలంటీర్లతో పాటు అన్ని వర్గాలను దీనిలో భాగస్వాములను చేస్తారు. తయారు చేసిన విత్తన బంతులను జులై, ఆగస్టు నెలల్లో నేరుగా, డ్రోన్ల ద్వారా చల్లనున్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ అటవీశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## భారత్‌లో అడుగుపెట్టిన అమెరికా విదేశాంగమంత్రి... ఇరాన్ చురక

మొదట కోల్‌కతా చేరుకున్నారు. అక్కడి మిషనరీస్ ఆఫ్ చారిటీని సందర్శించారు. ఆ తర్వాత ఢిల్లీకి చేరుకుని, సేవాతీర్థ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. ఆ తర్వాత విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌తో సమావేశం కానున్నారు.

## మంచోడినంటూ జగన్ సెల్ఫ్ సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నాడు: పయ్యావుల ఫైర్

గొడ్డలివేటు వేసి, దాన్ని గుండెపోటుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన జగన్ చరిత్ర రాష్ట్రంలో నిక్కరు వేసుకునే పిల్లాడిని అడిగినా చెబుతాడు. అలాంటి సున్నితమైన విషయంలోనూ పచ్చి అబద్ధాలతో పబ్బం గడుపుకుంటున్నారు" అని మండిపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోకి నేరమయ, ఫ్యాక్షన్ సంస్కృతిని ప్రవేశపెట్టిందే వైఎస్ కుటుంబమని పయ్యావుల ఆరోపించారు. "కేవలం కొన్ని వర్గాలకే పరిమితమైన కక్షలను వ్యవస్థీకృతం చేసి రాజకీయాల్లోకి తెచ్చిన ఘనత జగన్ తాత రాజారెడ్డిది. 1989లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాయలసీమలో ఫ్యాక్షనిజానికి అధికార అండదండలు లభించాయి. పులివెందుల నియోజకవర్గంలోని పార్నపల్లి గ్రామంలో టీడీపీకి మెజార్టీ వచ్చిందన్న ఒకే ఒక్క కారణంతో, ఆ గ్రామ నేతల ఇళ్లకు డ్రిల్లింగ్ చేసి డైనమైట్లతో పేల్చివేసిన భయానక చరిత్ర వారిది. ఈ ఘటనను రాయలసీమ ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. ప్రత్యర్థులపై దాడి చేయించి, తాము వేరే ప్రాంతంలో ఉన్నట్టుగా ఎలిబీ సృష్టించుకునే కొత్త నేర సంస్కృతి వారిదే. పులివెందులలో రాజారెడ్డి హయాంలో సాగిన అరాచకాలు, హత్యారాజకీయాలపై త్వరలోనే సమగ్ర ఆధారాలతో ఒక పుస్తకాన్ని తీసుకువస్తాం" అని పయ్యావుల ప్రకటించారు.

నాడు విధ్వంసం.. నేడు నిర్మాణం

జగన్ ఐదేళ్ల పాలనలో ప్రతి వ్యవస్థ, ప్రతి రంగం, ప్రతి ప్రాంతంపైనా గొడ్డలివేటు వేశారని, అందుకే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని 'గొడ్డలి పార్టీ' అనాల్సి వస్తోందని పయ్యావుల విమర్శించారు. "ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అయ్యాకే రాయలసీమలో ఫ్యాక్షనిజం అంతమైంది. జగన్ తన పాలనలో పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారు. అచ్చెన్నాయుడి నుంచి చంద్రబాబు దాకా అరెస్టులతో రాష్ట్రంలో భయోత్పాతాన్ని సృష్టించారు. నాడు జగన్ పొక్లెయిన్లను విధ్వంసానికి వాడితే, నేడు కూటమి ప్రభుత్వం అదే పొక్లెయిన్లను రాష్ట్ర పునర్నిర్మాణానికి వినియోగిస్తోంది. సుమారు 800 పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శరవేగంగా అడుగులు వేస్తున్నాం. యువత వైఎస్ ఫ్యామిలీ విధ్వంసకర చరిత్రను తెలుసుకోవాలి," అని పిలుపునిచ్చారు.

తండ్రినే ముద్దాయిని చేసిన ఘనత జగన్‌ది

వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కోర్టు కేసుల్లో ముద్దాయిగా మార్చింది స్వయంగా జగనేనని, ఈ నిజాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా చెప్పారని పయ్యావుల గుర్తుచేశారు. "నాడు వైఎస్సార్‌ను కోర్టులో ముద్దాయిగా చేర్చిన లాయర్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి జగన్ తన ప్రభుత్వంలో ఉన్నత పదవి ఇచ్చి సత్కరించారు. వైఎస్సార్ మరణం వెనుక రిలయన్స్ హస్తం ఉందని ఆరోపించి, ఆ తర్వాత అదే సంస్థకు చెందిన వ్యక్తికి రాజ్యసభ సీటు ఎలా ఇచ్చారు? వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని మంత్రిగా ఉన్నప్పుడు బొత్స సత్యనారాయణ అన్నారు, దానికి జగన్ సమాధానం చెప్పగలరా?" అని పయ్యావుల ప్రశ్నించారు.వైఎస్సార్ పాదయాత్రలో అస్వస్థతకు గురైతే తల్లి విజయమ్మ పరామర్శించారు గానీ జగన్ వెళ్లలేదని, వివేకాను చంపిందెవరో ఆయన కుమార్తె సునీత చెబుతుంటే జగన్ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని నిలదీశారు. నేరం చేయడమే నైజంగా మార్చుకున్న గొడ్డలి పార్టీ సమాజానికి అత్యంత హానికరమని ఆయన హెచ్చరించారు.

## ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో భేటీ

అంతేకాకుండా స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ముందుకు నడిపించే మార్గాలపైనా ఫలవంతమైన చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు.శనివారం ఉదయం అమెరికా నుంచి నేరుగా కోల్‌కతా చేరుకున్న రూబియో.. మదర్ థెరీసా స్థాపించిన మిషనరీస్ ఆఫ్ ఛారిటీని సందర్శించారు. సతీమణి జీనెట్‌తో కలిసి అక్కడికి వెళ్లిన ఆయన థెరీసాకు నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవా తత్వాన్ని కొనియాడుతూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. భారత్ పర్యటనలో భాగంగా మే 26న దిల్లీలో జరగనున్న క్వాడ్ కూటమి విదేశాంగ మంత్రుల సమావేశంలో రూబియో పాల్గొననున్నారు. ఈ కూటమిలో భారత్ సహా ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలు భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే.

## అక్రమంగా ఓట్ల తొలగింపును అడ్డుకుంటాం టీపీసీసీ చీఫ్

ఏఐసీసీ లేదా ముఖ్యమంత్రి బేరీజు వేస్తారని తెలిపారు. పీసీసీ మార్పులో ఏఐసీసీదే తుది నిర్ణయమన్నారు. ఏఐసీసీ దృష్టిలో బెస్ట్ పీసీసీ తెలంగాణే అని కేసీ వేణుగోపాల్ చెప్పారని గుర్తుచేశారు.

## సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం

రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా చిత్తూరు జిల్లా కంద్రిక గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు.

## ఆదాయ లక్ష్యాలను అందుకోవాలి


తప్పనిసరిగా హాజరు కావాలి" అని సూచించారు. ఖజానాకు గండి కొడుతున్న అక్రమార్కులపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు. మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన (పెంచిన) భూముల మార్కెట్ విలువలు (రిజిస్ట్రేషన్ ధరలు) అమలులోకి రానున్నాయని అధికారులు ఈ సమావేశంలో మంత్రుల బృందానికి వివరించారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పరిశ్రమల శాఖకు సంబంధించిన హిల్ట్ పాలసీ మార్గదర్శకాలు సిద్ధమయ్యాయని, వీటికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయని అధికారులు వెల్లడించారు. కీలక శాఖల్లో వనరుల పురోగతి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశం చేసింది.

## శ్రీ సాధన జూనియర్ కళాశాలలో బాలల, మహిళల భద్రత పై అవగాహన

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, మే 23)

మార్కాపురం పట్టణంలోని శ్రీ సాధన జూనియర్ కళాశాలలో బాలల, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ వై చలమయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా మార్కాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎండి అల్తాఫ్ హుస్సేన్, టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొని విద్యార్థులు, ప్రజలకు పలు సూచనలు అందించారు. పిల్లలు అపరిచితులతో మాట్లాడరాదని, తల్లిదండ్రుల అనుమతి లేకుండా ఎక్కడికీ వెళ్లకూడదని సూచించారు. స్కూల్‌కు వెళ్లే మార్గం, అత్యవసర ఫోన్ నంబర్లు గుర్తుంచుకోవాలని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని హెచ్చరించారు.మహిళలు రాత్రి వేళల్లో ప్రయాణించాల్సి వస్తే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాలని, ప్రయాణించే వాహనాల నంబర్లను పంచుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. వేధింపులు, మోసాలు ఎదురైనపుడు భయపడకుండా ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా మోసపూరిత కాల్స్, ఓటిపి అడిగే వారిని నమ్మకూడదని, సీసీ కెమెరాలు ఉన్న ప్రదేశాల్లో ఉండటం మంచిదని సూచించారు. బాలలపై నేరాలు, ఈవ్ టీజింగ్, సైబర్ మోసాలు వంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112 (పోలీస్), 1098 (బాలల సహాయం), 1091, 181 (మహిళల హెల్ప్‌లైన్) నంబర్లను వినియోగించాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రకాశం


మార్కాపురం


బాపట్ల

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
24.05.26 ఆదివారం


# పరిశుభ్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 23)

పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న "ఒక రాష్ట్రం ఒక పరిశుభ్రత లక్ష్యం" కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మున్సిపాలిటీ ఆపరేషన్ క్లీన్ స్విప్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి ఎన్ విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుండి నెల్లూరు బస్టాండ్ వరకు చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, సంతనూతలపాడు ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని చీపురు పట్టి పారిశుధ్య పనులను చేపట్టారు. ఈ సందర్భంగా నెల్లూరు బస్టాండ్ వద్ద తాటి ముంజలు అమ్ముకునే వారితో, తోపుడు బండి పై రాగి జావా అమ్ముకునే వారితో, ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ తరపున "ఆపరేషన్ క్లీన్ స్వీప్" అనే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఒంగోలు నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రారంభిస్తున్న "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం ఒక ముఖ్యమైన ముందడుగు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనలు మేరకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమాన్ని మే 23వ తేదీ నుండి నాలుగు వారాలపాటు ఒక క్రమపద్ధతిలో అమలు చేయబడుతుందని, మొదటి వారంలో నగరంలోని చెత్త ఎక్కువగా పేరుకుపోయే రెడ్ స్పాట్లు (ఎక్కువగా చెత్త పేరుకుపోయే ప్రాంతాలు), యెల్లో స్పాట్లు (పాక్షికంగా చెత్త పేరుకుపోయే ప్రాంతాలు) పూర్తిగా తొలగించడంపై దృష్టి సారించడం, రెండవ వారంలో కాలువలు, డ్రైనేజీ వ్యవస్థలను శుభ్రపరిచి, నీటి నిల్వలు మరియు వరద సమస్యలను నివారించడానికి చర్యలు తీసుకోవడం, మూడవ వారంలో నివాస, వాణిజ్య ప్రాంతాల్లో పరిశుభ్రతను మెరుగుపరచడం, నాల్గవ వారంలో పబ్లిక్ టాయిలెట్స్, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రజా ప్రదేశాలను శుభ్రపరచడం ద్వారా హైజీన్ ప్రమాణాలను పెంచడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి మున్సిపల్ సిబ్బంది కృషితో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరం. ప్రజలు చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా, పారిశుధ్య కార్మికులకు అందించాలి. తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్, ఈ సందర్భంగా నగర ప్రజలకు సూచించారు. అన్నీ వర్గాల ప్రజలు కలిసికట్టుగా పనిచేస్తేనే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం విజయవంతమవుతుందని, ఇది కేవలం నాలుగు వారాల కార్యక్రమం మాత్రమే కాదని, నిరంతరం కొనసాగించి శాశ్వత పరిశుభ్రత సంస్కృతిని

▶ మిగతా 4లో

# రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్‌కి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

వైసీపీ హయాంలో ఎక్కడి చెత్తను అక్కడే వదిలేశారు

అదేదో వారసత్వ సంపదలాగా మా ప్రభుత్వానికి అప్పగించారు

మొక్కలు నాటడం, చెట్లను పెంచడం

ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన, పర్యావరణ ప్రకృతిని అందిద్దాం

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రారభించిన మంత్రి, ఎమ్మెల్యే



(షణ్ముఖ వెలుగు, కనిగిరి, మే 23)

రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ కి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర సాధనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిశుభ్రత, స్వచ్ఛతను లక్ష్యంగా చేసుకుని ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమమే "ఆపరేషన్ క్లీన్ స్వీప్". "ఒక రాష్ట్రం.. ఒక పరిశుభ్రత లక్ష్యం" అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్‌కు ఏపీ ప్రభుత్వం పిలుపునిచ్చిన సందర్భంగా శనివారం కనిగిరి పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణలో జరిగిన కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలసి వికలాంగుల, సీనియర్ సిటిజన్ల సంక్షేమ మంత్రి డాక్టర్ డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లపై ఉన్న చెత్తను ఊడ్చి, మున్సిపాలిటీ ట్రాక్టర్‌లోకి ఎత్తి ప్రతి ఒక్కరూ పారిశుధ్యం పాటించాలని ప్రజలకు మంత్రి, ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కొరకు రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమం చేయాలని నిర్ణయించారని తెలిపారు. మొదటి వారం రోడ్లు, ప్రధాన కూడళ్లు, ప్రజలు ఎక్కువగా ఉండే

▶ మిగతా 4లో

# చీమకుర్తి చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

13 కేసుల్లో ఇద్దరు నిందితులు

37 సవర్ల బంగారం, 1.845 కిలోల వెండి వస్తువులు స్వాధీనం

రూ.37 లక్షల విలువ గల సొత్తు రికవరీ

జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు





(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, మే 23)

చీమకుర్తిలోని వెంకటేశ్వర హార్డువేర్ షాపులో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అత్యంత చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.37 లక్షల రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధర్ రాజు తెలిపారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. అద్దేపల్లి నరేష్‌బాబు అనే వ్యక్తి ఇసుకవాగు దగ్గర వెంకటేశ్వర హార్డువేర్ షాపు నిర్వహిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 8 గంటలకు షాప్ వద్దకు వెళ్లి చూడగా చెక్క తలుపులు బిగించి ఉన్న


▶ మిగతా 4లో

# చంద్రబాబు పాలనలోనే బడుగులకు నాణ్యమైన వైద్యం

ముఖ్యమంత్రి సహాయ నిధితో పేదలకు ఆర్థిక భరోసా

రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమమే కూటమి ధ్యేయం

ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, మే 23)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలోనే బడుగు, బలహీన వర్గాలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మంత్రి గొట్టిపాటి శనివారం అద్దంకి నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా సంతమాగులూరు మండలంలోని పుట్టావారి పాలెం క్యాంప్ కార్యాలయంలో 140 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ.62,02,865 విలువైన చెక్కులు, ఎల్ఓసీలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాడ్లాడుతూ., ముఖ్యమంత్రి సహాయ నిధి సహాయంతో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందన్నారు. అద్దంకి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు 3078 మందికి రూ.25.93 కోట్ల విలువైన చెక్కులు, ఎల్ఓసీలను అందజేసినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయిల సీఎంఆర్ఎఫ్ నిధులతో లక్షలాది మంది లబ్ధిపొందారని తెలిపారు. అద్దంకి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాకు వాటర్ ట్యాంకర్లు...అద్దంకి పర్యటనలో భాగంగా స్థానిక రిజిస్టార్ కార్యాలయాన్ని మంత్రి గొట్టిపాటి సందర్శించారు. ఉద్యోగుల కార్యాకలాపాలు, విధులు, ప్రజలకు అందుతున్న సేవలు, ఇతర అంశాలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. భవన స్థితిగతులపైనా (తరువాయి 4లో...)

# విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 23)

విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. మార్కాపురం పట్టణంలోని సౌజన్య ఫంక్షన్ హాలులో శుక్రవారం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఉచిత మూడు చక్రాల స్కూటర్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం కింద 17.5 కోట్లతో 1750 మందికి వీటిని అందజేస్తున్నట్లు వివరించారు. మార్కాపురం జిల్లాలో మొదటి విడతగా మొత్తం 40 స్కూటర్లను అందజేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా రూ.4.32 కోట్లతో దివ్యాంగుల హాస్టల్స్‌ను మరమ్మత్తులు చేస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.200 కోట్లతో ప్యారా స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు డిసబుల్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు త్వరలో దీనికి పూర్తి



# కంభంలో ఎంఆర్ఎఫ్ టైర్ షాపులో చోరీ

## సీసీ కెమెరాలు ధ్వంసం, రూ.50వేలు నగదు చోరీ

## వేలిముద్రల సహాయంతో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ శివ కృష్ణారెడ్డి





(షణ్ముఖ వెలుగు, కంభం, మే 23)

మార్కాపురం జిల్లా కంభం పట్టణంలోని వై జంక్షన్ సమీపంలో ఉన్న ఎంఆర్ఎఫ్ టైర్ షాపులో నిన్న రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని దుండగులు షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. షోరూమ్‌లోని క్యాష్ డెస్క్‌లో ఉంచిన రూ.50,000 నగదును అపహరించినట్లు సమాచారం. అంతేకాకుండా షాపులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, వాటికి సంబంధించిన స్టోరేజ్ డివైస్, చిప్‌ను కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కంభం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ కేసును కంభం ఎస్ఐ శివ కృష్ణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

# లాడ్జీల పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన సీఐ మల్లికార్జున

## అనుమానస్పద వ్యక్తుల పై వెంటనే సమాచారం ఇవ్వాలి





(షణ్ముఖ వెలుగు, కంభం, మే 23) జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు కంభం పట్టణంలోని వివిధ లాడ్జీలలో కంభం పోలీసులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కంభం సీఐ మల్లికార్జున ఆధ్వర్యంలో ఎస్ఐ శివ కృష్ణారెడ్డితో కలిసి చేసిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో లాడ్జీల రిజిస్టర్‌లు, అతిథుల వివరాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికల పై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు, లాడ్జి యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. సరైన గుర్తింపు పత్రాలు లేకుండా గదులు ఇవ్వవద్దని హెచ్చరించారు. పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని సీఐ మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 'రాజారెడ్డి రాజ్యాంగం' గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారు

## ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్

(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 23)



నేను ఉన్నాను... నేను అప్పుడప్పుడు ప్రెస్ మీట్ పెడతాను అని జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లికి వచ్చి ప్రెస్ మీట్ పెట్టి ఎప్పుడో జరిగిన హత్యల గురించి మాట్లాడటం వల్ల ప్రజలకు అర్థంకాక తలలుపటుకుంటున్నారని, రాజారెడ్డి రాజ్యాంగం గురించి ఎవరిని అడిగినా కథలు కథలుగా చెప్తారని ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు షేక్ రసూల్ మహమ్మద్ అన్నారు. శనివారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో మాట్లాడుతూ రాజారెడ్డి పోలికలు నాకొచ్చాయి అని గర్వంగా చెప్పుకున్న వ్యక్తి గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎస్సీ, ఎస్టీల పై అరాచకాలు, హత్యలు, ముస్లిం మైనార్టీల పై ఎన్నో హత్యలు చేయించి ఆస్తులను అక్రమంగా లాగేసుకుని నానా ఇబ్బందులు పెట్టించినది మీరు కదా అని ప్రశ్నించారు. హజ్ హౌస్ లో దొంగతనాలు చేయించిన చరిత్ర మీదన్నారు. తల్లిని తరిమేశాడు.. చెల్లిని ఆస్తి కోసం తరిమేశాడంటే జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిత్వం ఎలాంటిదో తెలుస్తుందన్నారు. 'మావిగన్' పేరు చెపితే చిన్నపిల్లలు కూడా నవ్వుతున్నారన్నారు. లండన్ వెళ్లి మందులు వేసుకున్నా ఇంకా సైకోతత్వం, మెంటల్ పోయినట్టులేదు అని ఆయన అన్నారు.

# పరిశుభ్రత అనేది ప్రతి పౌరుడి బాధ్యత



ఏర్పరచుకోవాలన్నారు. ఒంగోలు నగరాన్ని ఒక ఆదర్శ పరిశుద్ధమైన నగరంగా మార్చడంలో చేపట్టే పారిశుధ్య కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్నీ






నగరాలు, పట్టణాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ ఆపరేషన్ క్లీన్ స్విప్ కార్యక్రమాన్ని ఈ రోజు నుండి 4 వారాల పాటు జరుపుకోవడం జరుగుచున్నదని, అందులో భాగంగా శనివారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు







తెలిపారు. ఒక నగరం అభివృద్ధి చెందినదని చెప్పాలంటే, ముందుగా అది పరిశుభ్రంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్య సమస్యలు కూడా రావని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రభుత్వం చేపట్టే పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమీషనర్ వెంకట క్రిష్ణయ్య, ఒంగోలు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది, మెప్మా సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్‌కి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత





ప్రాంతాలను శుభ్రం చేయడం. రెండవ వారం పట్టణంలోని కాలువలు డ్రైనేజీలను పూడికతీసి శుభ్రపరచడం. మూడవ వారం ఇళ్లు, వ్యాపార సంస్థల నుంచి వచ్చే చెత్తను తడి, పొడిగా విభజించడం. నాల్గవ వారంపబ్లిక్ టాయిలెట్స్ (సార్వజనిక మరుగుదొడ్లు) పరిశుభ్రత పై ప్రత్యేక కార్యక్రమం ఇలా నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమం జరిగే విధంగా ప్రజల్లో అవగాహన తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. కేవలం మున్సిపల్ సిబ్బంది మాత్రమే కాకుండా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయగలమని అన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పురపాలక సంఘం కమిషనర్ పి శ్రీధర్, డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం, శానిటరీ ఇన్స్‌పెక్టర్ నాయబ్ రసూల్, ప్రభుత్వ అధికారులు, సచివాలయం సిబ్బంది, మెప్మా సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





# చంద్రబాబు పాలనలోనే బడుగులకు నాణ్యమైన వైద్యం



మంత్రి ఆరా తీశారు. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వచ్చే విధంగా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సేవలందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం అద్దంకి మున్సిపాలిటీలో తాగునీటి సరఫరా కోసం అధికారులు ఏర్పాటు చేసిన రెండు వాటర్ ట్యాంకర్లను మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు. వేసవితో పాటు, రాబోయే రోహిణీ కార్తెలో ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులూ లేకుండా సరఫరా ఉండేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అదే విధంగా అద్దంకి టౌన్ లో ప్రజలకు ఇబ్బంది లేకుండా చలి వేంద్రాలుతో పాటు మజ్జిగ పంపిణీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# చీమకుర్తి చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్



తాళాలు పగలగొట్టి అందులో నగదు, నగలను దొంగలించినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ చోరీలో 273 గ్రాములు బంగారం, ఒక కిలో 845 గ్రాముల వెండి వస్తువులను దొంగలించబడ్డాయి. నిందితులు మిరపల్లి ప్రసాద్, కుంభా సాంబయ్యలు వాటిని కనిగిరి మండలం నందమారెళ్ళ గ్రామం వద్ద పామూరు నుంచి స్కూటీ పై వస్తున్న వీరిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. నేరం జరిగిన వెంటనే సీసీటీవీ ఫుటేజీతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశామని తెలిపారు. ఈ కేసులో ఉన్న నిందితులిద్దరూ నెల్లూరు జిల్లాలోని సీతారాంపురం, ప్రకాశం జిల్లాలోని టంగుటూరు, కందుకూరు టౌన్, పొదిలి, కనిగిరి, శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లలో 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. ఈ కేసును చేధించిన డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ ప్రసాద్, ఎస్ఐ సంపత్ కుమార్, మద్దిపాడు ఎస్ఐ వెంకట సైదులు, కొత్తపట్నం ఎస్ఐ సుధాకర్, తాలూకా ఎస్ఐ సుదర్శన్, సంతనూతలపాడు ఎస్ఐ అజయ్‌బాబు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును చేదించారన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. చీమకుర్తి పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# విభిన్న ప్రతిభావంతుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

స్థాయి అధికారులను నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో 300 విభిన్న ప్రతిభావంతుల బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీకి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఇక ప్రతి జిల్లాలో ఒక దివ్యాంగ భవనాన్ని నిర్మిస్తామని వివరించారు. అంతే కాకుండా ప్రతి జిల్లాలో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక డాక్టర్లను నియమిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు అందజేస్తున్న ఈ స్కూటర్లు వారి దైనందిక జీవితంలో మంచిగా ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా మీకు కృత్రిమ పరికరాలు సైతం అందజేయడం జరుగుతుందని మరింత విశ్వాసంతో మీరు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. విభిన్న ప్రతిభావంతులకు సమాన అవకాశాలు పొందాలని ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ జి నారాయణస్వామి, మార్కాపురం గిద్దలూరు, కనిగిరి ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఎర్రగొండపాలెం తెదేపా ఇన్చార్జి గూడూరు ఎరిక్షన్ బాబు, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, డిఆర్ఓ వెంకట శివరామిరెడ్డి, ఆర్డీవో ప్రభాకర్, జనసేన ఇన్చార్జి ఇమ్మడి కాశీనాథ్, భాజపా జిల్లా అధ్యక్షులు పి వి కృష్ణారావు, మార్కాపురం ఏఎంసి ఛైర్మన్ మాలపాటి వెంకట్‌రెడ్డి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.












# ప్రజలంతా సహకరిస్తేనే పరిశుభ్రత సాధ్యం



**ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి**
**ఇళ్ల పరిసరాలను క్లీన్‌గా ఉంచుకోండి**
**ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు విజ్ఞప్తి**
**ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ హిమవంశీ**



**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 23)**

స్వర్ణఆంధ్ర - స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో భాగంగా, కందుకూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని పట్టణంలోని మాచవరం రోడ్డులో శనివారం ఉదయం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ కే అనూష, అధికారులు కూటమి పార్టీల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్ సహా అందరూ చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కేవలం అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది పనిచేయటం వల్ల స్వచ్ఛత - శుభ్రత సాధ్యం కాదన్నారు. పట్టణ ప్రజలు కూడా పూర్తిగా సహకరిస్తేనే, మున్సిపాలిటీని పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమని అన్నారు. అప్పుడే స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర పథకం యొక్క ఆశయం నెరవేరుతుందన్నారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు, తమ చుట్టూ ఉన్న పరిసరాలు క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచుకోవాల్సిన బాధ్యత పట్టణ ప్రజలు ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అన్నారు. ఇళ్ళు, దుకాణాలు, ఇంకా అనేక చోట్లనుంచి వచ్చే చెత్తను, పారిశుద్ధ్య సిబ్బంది సూచించిన విధంగా వేరుచేసి ఇవ్వాలన్నారు. కొన్నిదేశాలలో రోడ్లు, కాలువల్లో ఎలాంటి వ్యర్థాలు కనిపించవని, అక్కడి ప్రజలు బాధ్యతగా ఆలోచించడం వల్లే ఆయా ప్రదేశాలు చూడముచ్చటగా ఉంటున్నాయని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. మన దగ్గర కూడా ప్రజలు అలా ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. పట్టణాలు, గ్రామాల్లో స్వచ్ఛ కార్యక్రమాల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కందుకూరును ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, వార్డు అధ్యక్షుడు గుర్రం మాల్యాద్రి, క్లస్టర్ ఇన్చార్జి వడ్డేళ్ల రవిచంద్ర, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కల్లూరి శైలజ, తెలుగు ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, గుర్రం మల్లికార్జున, అత్తోట మధు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ బాషా, అన్ని వార్డుల అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.





# అధికరేట్లు వసూలు చేస్తే చర్యలు తప్పవు

**మాలకొండ పై పాటదారులకు ఎమ్మెల్యే ఇంటూరి హెచ్చరిక**









**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 23)**

మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలుప్రముఖ పుణ్యక్షేత్రం, మాలకొండపై వెలసిన శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామిని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తుల క్యూలైన్లు, అన్నప్రసాదం తయారీ, వేసవిలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను నాగేశ్వరరావు పరిశీలించారు. అన్నప్రసాదం నాణ్యతపై భక్తులతో మాట్లాడారు. నగదు, వస్తు రూపంలో అందిస్తున్న విరాళాలను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. భక్తితో అందిస్తున్న కూరగాయలు, బియ్యం, ఇతర వస్తువులు వృధా కాకుండా వినియోగించాలని అధికారులకు సూచించారు. లగేజీ పాయింట్, చెప్పుల స్టాండ్ వద్ద డబుల్ రేట్లు వసూలు చేస్తున్నట్లు భక్తులు ఫిర్యాదు చేయగా, పాటదారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొండపై పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నాగేశ్వరరావు పరిశీలించారు. వలేటివారిపాలెం మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నేతలు కాకుమాని హర్ష, కామినేని అశోక్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# స్వయంభూగా వెలసిన శ్రీ నాగజ్యోతి దుర్గా గంగా భవాని మాత 13వ వార్షికోత్సవ మహోత్సవం




**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, మే 23)**

దుర్గి మండలం శ్యామరాజుపురం గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ నాగజ్యోతి దుర్గా గంగా భవాని మాత 13వ వార్షికోత్సవ మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించిన. యాగంటి ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన, అభిషేకం చేశారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అనంతరం యాగంటి మల్లికార్జున రావు ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది భక్తులకు, పేదలకు స్వయంగా వడ్డించి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ శ్యామరాజపురంలో స్వయంభూగా వెలసిన నాగజ్యోతి దుర్గా గంగా భవాని మాత ఆశీస్సులు మన అందరిపై ఎల్లప్పుడూ ఉండాలి. అమ్మవారి కృపతో మన మాచర్ల నియోజకవర్గం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి. పేదవాడి ఆకలి తీర్చడం అన్నదానం కంటే గొప్ప సేవ లేదు. ఎన్టీఆర్ చూపిన బాటలో, చంద్రబాబు స్ఫూర్తితో మన వంతు సేవగా ప్రతి ఏటా ఇక్కడ అన్నదానం నిర్వహిస్తున్నాము అని అమ్మవారి దయతో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది అని యాగంటి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దుర్గి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నారయ్య ,బూత్ ఇంచార్జి బుజ్జి, గ్రామ టీడీపీ అధ్యక్షులు డాన్ శీను, గ్రామ మాజీ సర్పంచ్ తాటి రామారావు, కండె నాగేశ్వరరావు, డీలర్ నాగేశ్వరరావు, సీతయ్య, హనుమంతరావు, గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# రీవాల్యూషన్‌లో సైతం అత్యుత్తమ ఫలితాలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 23)**

శనివారం ప్రకటించిన రీవాల్యూషన్ ఫలితాలలో గతంలో 462 మార్కులు సాధించిన షేక్ అఫియా మరో రెండు మార్కులు రీవాల్యుషన్లో పొంది ఏకంగా ఎంపీసీ గ్రూప్ లో 464/470 మార్కులను సాధించారు. ఇప్పటికే షేక్ ఖైరున్నిసా 464 మార్కులు సాధించగా ఇప్పుడు ఈ సంఖ్య ఇద్దరికి చేరింది. 464 మార్కులు సాధించిన విద్యార్థినిలు షేక్ అఫియా, షేక్ ఖైరున్నిసాలను కళాశాల యాజమాన్యం కెవి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావులు ప్రత్యేకంగా అభినందించారు. సంచలన ఫలితాలను నమోదు చేస్తున్న శ్రీ వివేకానంద విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ఈ సంవత్సరం శ్రీ వివేకానంద కళాశాల ఎంచుకొని మంచి మార్కులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకోవాలని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని వారు తెలియజేశారు.



# ప్రభుత్వ మతతత్వ కుట్రల పై దళిత కవులు పోరాడాలి

**హైదరాబాద్‌లో జరిగిన పైడి, మద్దూరి, కాలేకూరి స్మారక అవార్డుల కార్యక్రమంలో దళిత నేత నీలం**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 23)**

దళిత కవులు రచయితలు మోడీ చంద్రబాబు మతతత్వ కుట్రలపై రచనలతో పోరాడాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్ర రావు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో దళిత కవిత దార్శనికులు పైడి, మద్దూరి, కాలేకూరి స్మారక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతు దళిత ఉద్యమం సృష్టించిన దళిత కవిత్వం మనువాద సాహిత్యానికి మంట పెట్టిందన్నారు. దళిత కవులు విప్లవ సాహిత్యానికి చెమటలు పుట్టించాయాన్నారు. భావ కవిత్వానికి తూట్లు పొడిచారన్నారు. కారంచేడు దళిత మారణకాండ పై విప్లవ యుద్ధ నౌక గద్దర్ గర్జించిన దళిత "పులులమ్మ" అను పాట దళిత విముక్తి పోరాట పతాకమన్నారు. చుండూరు దళిత మారణ హోమం పై కాలేకూరి ప్రసాద్ రాసిన కూమిలిపోయిన నలిగిపోయిన చుండూరు గుండెల గాయం దళిత గీతం భారత దేశం వ్యాప్తంగా చుండూరు జాతీయ ఉద్యమాన్ని నిర్మించిందన్నారు. దళితుడిని రాష్ట్ర పతి ని చేసింది చుండూరు ఉద్యమేనని అన్నారు. దాలుతుల కు వజ్రయాదుమైన ఎస్సీ ఎస్టీ యాక్ట్ ను తెచ్చింది కూడా చుండూరు ఉద్యమమేనన్నారు. మద్దూరి నగేష్ బాబు దళిత వాడుక బాషను కవితలగా తిరుగు బాటు రచనలు చేసి దళిత ఉద్యమానికి ఆది కవి గా మిగిలాడన్నారు. పైడి తేరేష్ బాబు ఎ నాడో హిందూ మహా సముద్రం అనే తీరట భారత దేశ కుల మత అణిచి వెతలు వివక్ష కుట్రల పై వర్గీకరణ వాధలపై తిరుగుబాటు చేసారన్నారు. మాల మాదిగలను వర్గీకరణ చేసి తృప్తి పడని అధికార అగ్రకుల బీజేపీ తెలుగుదేశం జనసేన పార్టీ లు మాల మాదిగలను హిందూ మాల మాదిగ క్రైస్తవ మాల మాదిగ లగా చీల్చడానికి ప్రాయోజిత కార్యక్రమలు ప్రవేశపెడుతున్నారన్నారు. తదనంతరం జరిగిన అవార్డు ల కార్యక్రమంలో దళిత నేత నీలం నాగేంద్ర రావుకు పైడి తేరేష్ బాబు , మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దార అంజయ్య కు మద్దూరి నాగేష్ బాబు స్మారక అవార్డు పద్మ శ్రీ కొలకలూరి ఇనాక్ మరియు ప్రజా కళాకారుడు గోరాటి వెంకన్న సభ కార్య నిర్వాహలు దళిత సాహిత్య వేత్త ప్రొఫసర్ జీవి రత్నాకర్ సమక్షంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో దళిత కవులు, కళాకారులూ పాల్గొన్నారు.



# ఎరువులు ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి

## మార్కాపురం జిల్లా వ్యవసాయ అధికారి డి బాలాజీ నాయక్




**(షణ్ముఖ వెలుగు, పొదిలి, మే 23)**

ఎరువుల వ్యాపారులు ఎమ్మార్పీ ధరలకే రైతులకు విలువలను విక్రయించాలని మార్కాపురం జిల్లా వ్యవసాయ అధికారి డి అర్జున్ నాయక్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ పరిశీలించారు. వ్యాపారుల





వద్ద పాత స్టాక్ ఉందని దానిని పాత ధరలకే రైతులకు విక్రయించాలని సూచించారు. ఇటీవల అంతర్జాతీయ పరిస్థితుల వల్ల ఎరువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఎమ్.ఆర్.పి. ముద్రించిన ఎరువుల బస్తాలను పరిశీలించి వాటిపై ఉన్న ధరకే రైతులు కొనుగోలు చేయాలన్నారు. పాత స్టాక్ ను కొత్త ధరలకు అమ్మితే వ్యాపారులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ఏడాది మార్కాపురం జిల్లాకు ఇప్పటికే 400 టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయని మొత్తంగా 81 వేల టన్నుల ఎరువులు అవసరం అవుతున్నట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. అదనంగా ఎరువుల కోసం ప్రభుత్వానికి తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పొదిలి, కొనకనమిట్ల మండలాల వ్యవసాయ అధికారులు దేవిరెడ్డి శ్రీనివాసులు, కె ప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

# ఒంగోలు అర్బన్, రూరల్ ప్రాంత ప్రజల రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేసేందుకు ప్రజా దర్బార్

## ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు




**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 23)**

ఒంగోలు అర్బన్ రూరల్ ప్రాంత ప్రజల రెవెన్యూ సమస్యలు ను త్వరితగతిన పరిష్కారం చేసేందుకు ప్రజా దర్బార్ నిర్వహించడం జరిగిందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అన్నారు. నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ప్రజా దర్బార్ కి సుమారు 300 మంది వారి యొక్క సమస్యలను ఎమ్మెల్యేతో పాటు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ ప్రజా దర్బార్ నిర్వహించడం వలన ప్రజల సమస్యలు తెలుసుకొని అధికారులు అక్కడికక్కడే పరిష్కార మార్గాలతో పాటు ఇంకా ఏదైనా సమస్య ఉంటే ఎంత సమయంలో పరిష్కారానికి అవకాశం ఉంది అనే తెలుసుకొని దానికోసం ఈ కార్యక్రమం బాగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల సమస్యలు, ఇంటి పట్టాల సమస్యలు, భూ సమస్యలు, స్థలాల సమస్యలు ఎక్కువగా వచ్చాయని వాటిని ఎప్పుడు లో గా పరిష్కారం చేస్తాము అనేది కూడా కంప్యూటర్లో నమోదు చేసి నేరుగా కాల్ సెంటర్ ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. కొంతమంది నివాసం ఉంచుకొని ఇల్లు కట్టుకోవడానికి వీలు లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి నివేశి స్థలాలకు పొజిషన్ సర్టిఫికెట్లు అందించడం జరిగిందని ఇంకా కొన్ని పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు తయారు చేశామని తెలిపారు. గత ఐదు సంవత్సరాలు కాలంలో భూ రికార్డులు తారుమారయ్యాయని, డబల్ రిజిస్ట్రేషన్ జరిగాయ ని అలాంటివన్నీ కూడా ఇద్దరి



కాగితాలను తెప్పించి పరిశీలించి ఎవరికి న్యాయం గా అనిపిస్తే వారికి హక్కు కల్పించే విధంగా చేస్తున్నామని అలాగే డబల్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యక్తులపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని అన్నారు. ఈ నెలలో జరిగిన ప్రజాధర్భార్లు ప్రతి ఒక్క అర్జీదారుడికి రసీదు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏడు నెలల పాటు ప్రజాదర్బార్ మరల రెండు రోజులపాటు నిర్వహిస్తామని రెవెన్యూ సమస్యలు పూర్తిస్థాయిలో తగ్గించేందుకు






ప్రయత్నం చేస్తున్నామని అదేవిధంగా ప్రజాదర్బార్ ద్వారా మా సమస్యలు పరిష్కారం అయినవి అని ప్రజల నుంచి స్పందన వచ్చే విధంగా పరిశీలన చేస్తామని అధికారులు కూడా అదే తీర్పుల పని చేస్తారని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించి అధికారులు చుట్టూ తిరగకుండా చేయడమే తమ యొక్క లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్దేశం కూడా ఇదేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, ఏం సి చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, తాసిల్దారులు పి. మధుసూదన్ రావు, కృష్ణమోహన్, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



# కనీస మానవ హక్కుల పోరాటానికి పునరంకితమవుదాం

## మేధోమదన సదస్సు తీర్మానం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 23)**



ప్రస్తుతం దేశంలో మృగ్యమవుతున్న కనీస మానవ హక్కుల కోసం పోరాడడానికి బాబా సాహెబ్ అంబేద్కర్ పోరాటాల స్ఫూర్తిగా పునరంకితమవుదామని వాయిస్ సంస్థ జాతీయ అధ్యక్షులు డిఎంఆర్ శేఖర్ పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ అంబేద్కర్ నిర్వహించిన ' మహత్ చెరువు మానవ హక్కుల ఉద్యమానికి వందేళ్ళు నిండిన సందర్భంగా వాయిస్-స్ఫూర్తి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల సమన్వయంతో ఒంగోలు సిపిఐ కార్యాలయ సెమినార్ హాల్లో సదస్సు నిర్వహించారు. సదస్సులో తొలుత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహాత్మ జ్యోతిరావు ఫూలేల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సదస్సును అధ్యక్షుడు డిఎంఆర్ శేఖర్ ప్రారంభిస్తూ 2011 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్లో 16.4% షెడ్యూల్ కులాలు 5.6% షెడ్యూల్ తెగలు 50% వెనుకబడిన వర్గాలు ఐదు శాతం ముస్లింలు ఉన్నారని, వీరు విద్యా వైద్య రంగంలో నానాటికి వెనకబడి పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

యువతకి, నిరుద్యోగులకు, అసంఘటిత కార్మికులకు ప్రత్యేకంగా సామాజిక పెన్షన్లు వర్తింపజేయాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. సదస్సు సమన్వయకర్తలుగా స్ఫూర్తి సంస్థ అధ్యక్షుడు, విశ్రాంత ఐఆర్ఎస్ ఉద్యోగి బివి రావు, మన్నం ప్రసన్నరాజులు వ్యవహరించగా వాయిస్ వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం సుబ్బారావు,డిబిఎస్ యూ ప్రతినిధి పి.చిట్టిబాబు లు మానవ హక్కులు, సాధికారత, బడ్జెట్-సబ్ ప్లాన్, ఫ్రాంక్లిన్ సుధాకర్-దళిత క్రైస్తవ రిజర్వేషన్లు అనే అంశంపై ప్రసంగాలు చేసారు.

భోజనం అనంతరం మధ్యాహ్నం నిర్వహించిన సదస్సులో విసికే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఏంజె. విద్యాసాగర్, దళిత మహాసభ అధ్యక్షుడు నూకతోటి బాబూరావు, బహుజన కెరటాలు ప్రతినిధి పల్నాటి శ్రీరాములు, ఎరుకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మోహన్ కుమార్ ధర్మా, మాల ఉద్యోగుల జెఎసి అధ్యక్షుడు తుళ్ళిమల్లి అశోక్, డిహెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కరవది సుబ్బారావు, కెవిపిఎస్ కార్యదర్శి బి.రఘురాం, కెఎన్ పీఎస్ ప్రధాన కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, ప్రముఖ కవి కత్తి కళ్యాణ్, ప్రముఖ నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు, డిబిఎస్యూ జిల్లా మహిళా ప్రతినిధి శిరీష, లిబరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిటితోటి శోభన్, జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారావు, పాలడుగు విజేంద్ర బహుజన్, విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి తేళ్ల అంజయ్య, ఎమ్ఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాదిగ, తదితరులు ప్రసంగించగా వాయిస్ సంస్థ ప్రచురించిన విజయవాడ డిక్లరేషన్, కళ్యాణ్ సంపాదకత్వంలో ప్రచురించిన 'మనకాలం' పత్రిక, ప్రజాకాంక్ష, అంబేద్కర్ ప్రత్యేక సంచికలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. పలు రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల ప్రతినిధులు, పలువురు న్యాయవాదులు, విశ్రాంత ఉద్యోగులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# ఎండ తీవ్రతపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 23)**




జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ఆదేశించారు. వినుకొండ పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 26వ తేదీ వరకు తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, కార్మికులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఎండ ప్రభావానికి గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరం అయితేనే బయటకు రావాలని, అలా వచ్చేటప్పుడు తగినంత తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని పేర్కొన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరగడం, అధిక దాహం, తలనొప్పి, వాంతులు, అలసట వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో ఉన్న వైద్య కేంద్రాలను సంప్రదించాలని, దీనిపై గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యమైన కూడళ్లలో చలివేంద్రాలు, బస్టాండ్లలో తాత్కాలిక పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు, ఎస్ఎస్సి తదితర పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో కరెంటు కోతలు, లో వోల్టేజీ లేకుండా నిరంతరాయంగా విద్యుత్తును సరఫరా చేయాలని, మున్సిపల్, పంచాయతీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేసి అంగన్‌వాడీలు, పాఠశాలలు, బస్టాండ్లలో తాగునీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు, మూగజీవాలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని, పరిశ్రమల్లో రసాయనిక పదార్థాల దగ్గర మరియు పొలాల్లో వ్యర్థాలను కాల్చేటప్పుడు అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడా ఎటువంటి లోటు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

# మహానాడును విజయవంతం చేయండి

## పిలుపిచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

## కార్యాలయంలో మహానాడు సన్నాహక సమావేశం

## భారీగా హాజరైన నేతలు, కార్యకర్తలు, అభిమానులు







**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, మే 23)**

ఈ నెల 27, 28 తేదీలలో వర్చువల్‌గా జరగబోయే మహానాడులో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అన్నగారి అభిమానులు, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మహానాడు కార్యక్రమం విజయవంతం చేయడానికి కందుకూరులోని టిడిపి కార్యాలయంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించగా నియోజకవర్గంలోని మండల, గ్రామ, వార్డు అధ్యక్షులు మరియు క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, పార్టీ సీనియర్ నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులు అర్పించిన తరువాత ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ పొదుపు చర్యల్లో భాగంగా ఈ ఏడాది మహానాడును వర్చువల్‌గా నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు, నియోజకవర్గంలోని 11 క్లస్టర్ల పరిధిలో, ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయా క్లస్టర్ పరిధిలోని గ్రామాల నాయకులు, కార్యకర్తలు, భారీగా హాజరై, నియోజకవర్గంలో పార్టీ బలం, ఐకమత్యం చూపించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనేలా పార్టీ నేతలు చొరవ తీసుకోవాలన్నారు. వైసిపి అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తన తాత, తండ్రి, బాబాయిలను చంద్రబాబు నాయుడు హత్య చేయించినట్లు జగన్ మాట్లాడటం చూస్తుంటే, అతని మానసిక స్థితిపై అనుమానాలు వస్తున్నాయన్నారు. సాక్షి మీడియాలో ఇష్టం వచ్చినట్లు అసత్య వార్తలను ప్రసారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 సీట్లకు పరిమితం చేసినా జగన్‌కు, ఆ పార్టీ నేతలకు ఇంకా బుద్ధి ఆలోచనలో ఎలాంటి మార్పు రాలేదన్నారు. విశేష అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు పోవడాన్ని, గొడ్డలి పార్టీ జీర్ణించుకోలేకపోతోందని నాగేశ్వరరావు అన్నారు. రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు మరోసారి బుద్ధి చెప్పటం ఖాయమన్నారు. కందుకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలంగా ఉందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు స్పష్టం చేశారు. లేనిపోని ఆరోపణలు, ఏదో జరిగిపోతోందన్న కొందరి వ్యాఖ్యలను ఎమ్మెల్యే తీవ్రంగా తప్పుపట్టారు. ఎవరెన్ని మాట్లాడినా తానేంటో ప్రజలకు తెలుసన్నారు. 20 ఏళ్ల చరిత్రను తిరగరాస్తూ, తాను అత్యధిక మెజారిటీతో గెలుపొందడంలో నాయకులు, కార్యకర్తల అందరి కృషి ఎంతో ఉందన్నారు. ప్రజల కోసం తాను 24 గంటలు అందుబాటులో ఉంటున్నానని, వారి ఆశీర్వాదాలతో మరోసారి గెలిచి, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మహానాడు విజయవంతం కోరుతూ కందుకూరు పట్టణం, కందుకూరు రూరల్, వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లోని ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే ఇంటూరి విడివిడిగా మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే సమావేశం, ఏర్పాట్లపై నేతలకు పలు సూచనలు చేశారు.

ఈ సమావేశంలో కందుకూరు పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, మాదాల లక్ష్మీనరసింహం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, క్లస్టర్ ఇన్చార్జులు చిలకపాటి మధు, వడ్డేళ్ళ రవిచంద్ర, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, చిత్తారు మల్లికార్జున, పోలుబోయిన శ్రీను, బొద్దులూరి కొండలరావు, గొంది నర్సింగరావు, రాష్ట్ర కమిటీ నేతలు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, నాదెళ్ల వెంకటరమణయ్య, కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పార్లమెంట్ కమిటీ నేతలు చదలవాడ కొండయ్య, షేక్ రూబీ, నియోజకవర్గ కమిటీ నేతలు అల్లం వెంకటేశ్వర్లు, పూరిమిట్ల మాల్యాద్రి, కల్లూరి శైలజ, పువ్వాడి మౌనిక, షేక్ మున్నా, పొడపాటి మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, పట్టణ కమిటీ నేతలు సవిడిబోయిన వెంకటకృష్ణ, అహ్మద్ భాషా, అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, గ్రామ, వార్డు కమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇన్చార్జులు, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

---

# విభిన్న ప్రతిభావంతులకు చేయూతనందించాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, మే 23)**

విభిన్న ప్రతిభావంతులకు ప్రతి ఒక్కరు చేయూతను అందించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పేర్కొన్నారు. ఎర్రగొండపాలెం పట్టణంలోని బీసీ కాలనీలో పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మానవతా దృక్పథం తో పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సమాజంలో విభిన్న ప్రతిభావంతులను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు వారికి ఏదో ఒక రూపంలో సహాయం అందిస్తే సమాజంలో వారు మరింత ఆశా భావంతో ముందుకు సాగుతారని సూచించారు. ఈ సందర్భంగా మొత్తం 30 మందికి ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రిప్రజెంటేటివ్ ప్రవీణ్ కుమార్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, మే 23)**

పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అన్నారు. మార్కాపురం పట్టణంలోని సెవెన్ హిల్స్ వద్ద శనివారం ఆపరేషన్ క్లీన్ స్వీప్ - వన్ స్టేట్ - వన్ క్లీన్ మిషన్ కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన జీవన విధానానికి శుభ్రత ఎంతో కీలకమన్నారు. అలాగే చెత్తను నిర్దేశిత ప్రదేశంలో మాత్రమే వేయాలని, తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో భాగంగా మొదటి వారం రోడ్లు, ప్రభుత్వ స్థలాలు, రెండవ వారం కాలువలు, మూడో వారం ఇల్లు, దుకాణాల వద్ద చెత్త వేరు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. నాలుగో వారం పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రపరిచారు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత అందరి పైన ఉందన్నారు. దానికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు భాగస్వాములై ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఆర్టీసీ డిఎం లావణ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.












# ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి



**(షణ్ముఖ వెలుగు, బేస్తవారిపేట, మే 23)**

శనివారం ఉదయం కొత్తపల్లి గ్రామం దగ్గర కొమ్మ పెద్ద రంగమ్మ (41) ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపి మోటర్ బైక్ పై వెళ్తున్న పెద్ద రంగమ్మను ఢీకొన్నాడు. దీంతో పెద్ద రంగమ్మ బైక్ మీద నుండి క్రిందపడి అక్కడికక్కడే మరణించింది.

# కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి రూ.80,116 విరాళం

## దైవకార్యాల్లో భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకృతం

## ఎన్ఆర్ఐ తోడేటి సుబ్బయ్య





**(షణ్ముఖ వెలుగు, బద్వేలు, మే 23)**

బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని జాంబవంత నగర్‌లో వెలసిన శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ప్రముఖ ఎన్నారై తోడేటి సుబ్బయ్య, వారి సతీమణి తిరుపతమ్మ కుటుంబ సభ్యులు రూ. 80,116 భారీ విరాళం అందజేసి తమ అపార దాతృత్వాన్ని చాటుకున్నారు. శనివారం సాయంత్రం జాంబవంత నగర్‌లోని పునర్నిర్మాణంలో ఉన్న కోదండ రామాలయాన్ని తోడేటి సుబ్బయ్య తన కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించి, కమిటీ సభ్యుల కృషి పట్ల వారు తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్నారై తోడేటి సుబ్బయ్య మాట్లాడుతూ 'బద్వేల్ మున్సిపాలిటీలో రాత్రింబగళ్లు కష్టపడే కార్మికులు నివాసం ఉండే ఏరియాలో, గత 15 సంవత్సరాల క్రితం ఆగిపోయిన దేవాలయ నిర్మాణాన్ని నేడు పునఃప్రారంభించడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి పుణ్యకార్యాల్లో, దైవకార్యాల్లో మన వంతు భాగస్వాములు కావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. బద్వేల్ పట్టణ పరిసర ప్రాంతాలలోని పలువురు దాతలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి, ఈ ఆలయ పునర్నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి తమ సహాయ సహకారాలు అందజేయడం చాలా సంతోషకరం. త్వరలో జరగబోయే ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారి కృపకు పాత్రులు కావాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

**ఆలయ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు :**

ఆలయాన్ని సందర్శించి భారీ విరాళం అందజేసిన తోడేటి సుబ్బయ్య–తిరుపతమ్మ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వల్లంకొండు వెంకటరమణ,కే.వి. సుబ్బారావు, సి.వి. నాగేశ్వరరావు,కాలువ నాగేంద్ర, హరి, శ్రీనులతో పాటు పలువురు భక్తులు ఆలయ పురోగతికి , ప్రతిష్ట మహోత్సవానికి ఆర్థిక సాయం అందించిన తోడేటి సుబ్బయ్య కుటుంబానికి ప్రత్యేక కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. జూన్ 18,19, 20 తారీకులలో జరగబోయే జాంబవంత నగర్ కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పట్టణ పరిసర ప్రాంత ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పలువురికి తెలిపారు.

# అవినీతికి బ్రాండ్ జగన్...అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబు

## ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు




(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 23)

రాష్ట్రంలో అవినీతికి కేరాఫ్ అడ్రస్ వైఎస్ జగన్ అయితే.. నవ్యాంధ్ర ప్రగతికి, అభివృద్ధికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. వినుకొండ పట్టణంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కూటమి నాయకులతో కలిసి మాట్లాడారు. గత జగన్ ప్రభుత్వం కేవలం చెత్త పన్నులు వేసి ప్రజలను పీడించిన ఒక చెత్త ప్రభుత్వమని, అదే చంద్రబాబు నాయుడు గారు చెత్తను కూడా సంపదగా మార్చి చూపించిన అపర చాణక్యుడని కొనియాడారు. మట్టి, ఇసుక, రేషన్ బియ్యం సైతం వదలకుండా అమ్ముకున్న ఘనత ఒక్క వైసీపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో అవినీతికి బ్రాండ్ జగన్ అయితే, వినుకొండ నియోజకవర్గంలో అవినీతికి బ్రాండ్ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని జీవీ ఆంజనేయులు ఘాటుగా విమర్శిస్తూ ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు. గతంలో సొసైటీ బ్యాంకులలో లోన్ల పేరుతో ప్రజల సొమ్మును దోచుకున్నది, ఆ అవినీతి అక్రమాలకు పాల్పడి జైలుకు వెళ్లి వచ్చింది వైసీపీ నాయకులేనని మండిపడ్డారు. వారు చేసిన దోపిడీలు, లూటీలకి గత ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పి గుణపాఠం నేర్పినా వారిలో ఇంకా మార్పు రాకపోవడం సిగ్గుచేటన్నారు. కనీసం రోడ్ల గుంతలు కూడా పూడ్చడం చేతకాని వైసీపీ నేతలు, నేడు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ 'సూపర్ సిక్స్' పథకాలను పక్కాగా అమలు చేస్తోందని, ఇవన్నీ చూస్తూ కూడా విమర్శలు చేస్తున్న వారు "మీ కళ్ళల్లో ఏమైనా సీసం పోసుకున్నారా?" అంటూ తీవ్రంగా ప్రశ్నించారు. అమరావతి అభివృద్ధి, సూపర్ సిక్స్ అమలు చూసి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు నిద్ర పట్టడం లేదని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్ల పాలనలో మీరు పోలవరం, అమరావతి ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దోపిడీ చేయడమే తప్ప అభివృద్ధి చేయడం చేతకాని వైసీపీ నేతలు కళ్ళు లేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని, వైసీపీ కి ఉన్న 11 మంది ఎమ్మెల్యేలు అమరావతికి వచ్చి ఇక్కడి ప్రగతిని కళ్లారా చూడాలని సవాల్ విసిరారు. కేవలం అసత్య ప్రచారాలు చేయడం కోసమే వైసీపీ వాళ్ళు ప్రెస్ మీట్లు పెడుతున్నారని ధ్వజమెత్తారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా వినుకొండలో వార్డుల సంఖ్యను 32 నుండి 36 కి పెంచడం పూర్తిగా శాస్త్రీయంగా జరిగిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ ప్రగతిని వివరిస్తూ.. 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ ఆర్థిక సాయం అందిస్తున్నామని, కూటమి అధికారంలోకి రాగానే పెన్షన్లు భారీగా పెంపు చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని గుర్తుచేశారు. అలాగే నిరుద్యోగుల కోసం రికార్డు స్థాయిలో 16,340 పోస్టులతో మెగా డీఎస్సీ ఉద్యోగాల భర్తీ చేపట్టామని వివరించారు. రాష్ట్రానికి ఏకంగా రూ.16 లక్షల కోట్ల భారీ పెట్టుబడులను తీసుకువచ్చామని, పెద్ద సంఖ్యలో భారీ ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తుండటంతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని స్పష్టం చేశారు. ఇదే సమయంలో, పర్యావరణ పరిరక్షణ కోసం కోట్లాది మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి నిర్ణయం అత్యంత అభినందనీయమని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కొనియాడారు. ఽఈ విస్తృత స్థాయి విలేకరుల సమావేశంలో జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు మరియు కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**జగన్ పై చేసిన సవాల్ కు కట్టుబడి ఉన్నా...**

కాగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని జీవి ఆంజనేయులు స్పష్టం చేశారు. సూపర్ సిక్స్ హామీలు అమలు జరగడంలేదని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన విమర్శలను కూటమి ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. వినుకొండ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీల అమలును తాను వైఎస్ జగన్మోహన్ రెడ్డికి చూపిస్తానని చెప్పిన సవాల్కు తాను నేటికీ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. వైయస్ జగన్ రాకపోయినా ఆ పార్టీ నాయకుడు బొల్లా బ్రహ్మనాయుడు వచ్చిన... బ్రహ్మనాయుడు సొంత గ్రామము వేల్పూర్‌లో టిడిపి నాయకులు లేదా కార్యకర్తలు వచ్చి సూపర్ సిక్స్ పథకాల హామీల అమలను నిరూపిస్తారని దమ్ముంటే బొల్లా బ్రహ్మనాయుడు గానీ జగన్ గానీ రావాలని మరోమారు సవాల్ విసిరారు జీవీ ఆంజనేయులు.




# ఇక బొల్లా శాశ్వత విశ్రాంతి తీసుకుంటే మంచిది

## బొల్లా హయాంలోనే సొసైటీల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది

### మక్కెన ఘాటు విమర్శలు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 23)

బొల్లా మతిభ్రమించి మాట్లాడుతున్నాడని, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, తాను ఇద్దరం కలిసి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుంటే అసూయ, అక్కస్సుతో బొల్లా అహంకార ధోరణితో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే, జిడిసిసి బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఘాటుగా విమర్శించారు. 3 సార్లు ఎమ్మెల్యేగా, ప్రస్తుత చీఫ్ విప్ గా బాధ్యతలు నిర్వహిస్తూ ముందుకు వెళుతున్న జీవీ ఆంజనేయులును విమర్శించే స్థాయి బొల్లా బ్రహ్మనాయుడుకు లేదని మక్కెన అన్నారు. ఐదేళ్ల బొల్లా పాలన, అరాచకాలు, దౌర్జన్యాలు, కోపరేటివ్ సొసైటీలలో భారీ అవినీతి జరిగిందని, నేటి సొసైటీలో పాలన, రుణాల మంజూరును బేరీజు వేసుకోవాలన్నారు. ఈపూరులో నాణ్యత ప్రమాణాలతో 11 కోట్ల 30 లక్షలతో కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. కాగా వైసీపీ హయాంలో బొల్లా సొంత గ్రామమైన వేల్పూరులో నిర్మించిన కోల్డ్ స్టోరేజీ రైతులకు అందుబాటులో లేక తీవ్ర అసౌకర్యంగా ఉన్న కారణంగా నిర్వీర్యంగా మారిందన్నారు. బొల్లా హయాంలో ఓ సొసైటీలో రెండు కోట్ల 70 లక్షల భారీ అవినీతి జరిగితే, ఈ అవినీతికి సంబంధించిన ఉద్యోగిని సస్పెండ్ చేసి కోటి రూపాయల వరకు రికవరీ చేయడం జరిగిందని, అలాగే వైసీపీ హయాంలో సొసైటీలో జరిగిన అవినీతిపై విచారణ జరుపుతూ రికవరీలు చేస్తూ తగు చర్యలు తీసుకుంటున్నారే తప్ప మరోటి కాదని అన్నారు. నేడు 40 పైసలకే విరివిగా రైతు రుణాలు మంజూరు చేస్తున్నామని మక్కెన అన్నారు. ఇక సూపర్ సిక్స్ పథకాలపై నానా యాగీ చేస్తున్న జగన్మోహన్ రెడ్డి, ఇక్కడ బొల్లా బ్రహ్మనాయుడు ఎక్కడ సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదో చూపాలన్నారు. కళ్ళు ఉండి కబోదుల్లాగా మాట్లాడడమేనన్నారు. బొల్లా ఐదేళ్ల పాలనలో కొండపై ఘాట్ రోడ్డు నిర్మాణం, గిరి ప్రదర్శన రోడ్డు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని, నేడు జీవీ ఆంజనేయులు కోటి 85 లక్షలతో గిరి ప్రదర్శన రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ లను విమర్శించే స్థాయి బొల్లాకు ఎక్కడ ఉందని మక్కెన ఘాటుగా విమర్శించారు. ఇక గాంభీరాలు పలుకుతున్న బొల్లా బ్రహ్మనాయుడు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, నెలకు ఒక మారు వినుకొండ వచ్చి వెళుతుంటే మీ నాయకులు, ప్రజలు నమ్మే స్థితిలో లేరని, బొల్లా శాశ్వత విశ్రాంతి తీసుకోవడమే మంచిదని మక్కెన హితవు పలికారు. ఈ సమావేశంలో బొంకూరి రోశయ్య, సౌదాగర్ జానీ బాషా, గోవిందరాజులు పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్‌లో పోలీసుల ముమ్మర తనిఖీలు

## జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, మే 23)

రాష్ట్రంలో చెడ్డీ గ్యాంగ్ సంచరిస్తోందనే వార్తల నేపథ్యంలో మార్కాపురం జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తర్లుపాడు మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఎస్ఐ బ్రహ్మనాయుడు తన సిబ్బందితో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో, ప్లాట్‌ఫారాల పై అనుమానాస్పదంగా తిరుగుతున్న పలువురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వివరాలను, గుర్తింపు కార్డులను పరిశీలించారు. ఎస్ఐ బ్రాహ్మనాయుడు మాట్లాడుతూ ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగానే ఈ తనిఖీలు చేస్తున్నాం. అపరిచిత వ్యక్తులుగానీ, అనుమానాస్పద కదలికలు గానీ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

(షణ్ముఖ వెలుగు, నూజండ్ల, మే 23)

మండలంలోని కంభంపాడు గ్రామం నందు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో గ్రామ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంభంపాడు ప్రీమియర్ లీగ్ సీజన్-4 టోర్నమెంట్‌ను స్వర్గీయ సంకురి ఏసుపాదం మాస్టారు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నతనం నుండి క్రీడలో పాల్గొనడం ద్వారా శారీరక మానసికస్తైర్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్రీడలకు తప్పనిసరిగా సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేసారు. టోర్నమెంట్ నిర్వాహకులు సంకుల లింగారావు మాట్లాడుతూ ఈ టోర్నీకి 32 జట్లను మాత్రమే తీసుకున్నట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.30,116, రెండవ బహుమతి రూ.20,116, మూడవ బహుమతి రూ.15,116, నాల్గోవ బహుమతి రూ. 10,116 లుగా నిర్ణయించినట్లు తెలిపారు. విజేతలకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు కూడా ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు క్రీడాకారులుకు మధ్యాహ్నం భోజనం సదుపాయం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సబ్యులు మద్దుల బాలయ్య, నీలం సతీష్, యం వెంకట నారాయణ, టౌర్నమెంట్ కమిటీ సభ్యులు మాలపాటి వీరనారాయణ, జగదీష్, నరేంద్ర, శ్రీకాంత్ సత్యనారాయణ, శ్రీధర్, గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు, తదితరులు పాల్గొన్నారు.





**ఉత్కంఠభరితంగా సాగిన తొలి మ్యాచ్‌లో వీరాయపాలెం టైటాన్స్ విజయం**

తొలి లీగ్ మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. వీరాయపాలెం టైటాన్స్, ఎంసిపి జంగాలపల్లి జట్ల మధ్య జరిగిన ఈ మ్యాచ్ చివరి వరకు ఉత్కంఠభరితంగా సాగి సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. మొదట బ్యాటింగ్ చేసిన వీరాయపాలెం టైటాన్స్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 100 పరుగులు సాధించింది. వీరాయపాలెం టైటాన్స్ జట్టులోని అక్షయ్ బ్యాట్స్‌మెన్ 38 బంతుల్లో 64 పరుగులు చేసి ఆకట్టుకునే షాట్లతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం లక్ష్య చేధనకు దిగిన ఎంసిపి జంగాలపల్లి జట్టు కూడా అద్భుతంగా పోరాడి 12 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసి మ్యాచ్‌ను టైగా ముగించింది. దీంతో మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించేందుకు సూపర్ ఓవర్ నిర్వహించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంసిపి జంగాలపల్లి జట్టు 2 వికెట్ల నష్టానికి 4 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బరిలోకి దిగిన వీరాయపాలెం టైటాన్స్ జట్టు కేవలం రెండు బంతుల్లోనే 5 పరుగులు సాధించి అద్భుత విజయాన్ని కైవసం చేసుకుంది. మ్యాచ్ మొత్తం ఉత్కంఠభరితంగా సాగడంతో ప్రేక్షకులు కేరింతలతో ఆటగాళ్లను ప్రోత్సహించారు. విజేత జట్టు ఆటగాళ్ల ప్రతిభపై నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ చీఫ్ జీవి ఆంజనేయులు





(షణ్ముఖ వెలుగు, వినుకొండ, మే 23)

రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే 'సాసా' (స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర) కార్యక్రమంలో భాగంగా పట్టణాలు, నగరాలను సంపూర్ణ చెత్త రహిత ప్రాంతాలుగా మార్చేందుకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' వినుకొండలో ఘనంగా ప్రారంభమైంది. ఈ పారిశుధ్య మహోద్యమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వయంగా పాల్గొన్నారు. చీపురు పట్టి వీధులను శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీరు పోసి ప్రజా చైతన్యాన్ని రగిల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌తో రాష్ట్ర రూపురేఖలు మారుతున్నాయని, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ప్రకటించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజల ఆరోగ్యానికి శ్రీకారం చుట్టవచ్చని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వం టన్నుల కొద్దీ వ్యర్థాలను పేరుకుపోయేలా చేసి, చెత్త మీద పన్నులు వేసిన ఒక "చెత్త ప్రభుత్వం" అని ఆయన తీవ్రంగా విమర్శించారు. స్వచ్ఛమైన వినుకొండ సాధన కోసం ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాబోయే 4 వారాల పాటు సాగే ఈ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలో మొదటి వారం సమస్యల గుర్తింపు–క్లీనింగ్, రెండో వారం డ్రైనేజీల పూడికతీత, మూడో వారం వ్యాపార సముదాయాలపై ప్రత్యేక నిఘా, నాలుగో వారం సమస్యాత్మక ప్రాంతాలకు శాశ్వత సుందరీకరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ 4 వారాల సుదీర్ఘ డ్రైవ్ జూన్ 19తో ముగుస్తుందని, అనంతరం జూన్ 20న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అత్యంత భారీ స్థాయిలో 'మెగా క్లీన్‌లెనెస్ డ్రైవ్' నిర్వహించి ప్రపంచ రికార్డు సృష్టించాలని ప్రభుత్వం సంకల్పించిందని జీవీ ఆంజనేయులు వెల్లడించారు.



ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు, జరిమానాల విధింపు వంటి పూర్తి అధికారాలు కలెక్టర్లకే ఇవ్వబడ్డాయి. మున్సిపల్ అధికారులు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచే క్షేత్రస్థాయిలో పనులు పర్య25క్షిస్తారని తెలిపారు. పారిశుధ్యంలో ప్రభుత్వంతో పాటు పౌరులకు 50–50 భాగస్వామ్యం ఉంది. తడి–పొడి చెత్తను విడివిడిగా మున్సిపల్ వాహనాలకే ఇవ్వాలి. వ్యాపార సంస్థలు కచ్చితంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలి. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోకపోతే నోటీసులు ఇస్తామని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు, ఒక ప్రజా ఉద్యమం. జూన్ 20న జరగబోయే ప్రపంచ రికార్డు డ్రైవ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జీవీ ఆంజనేయులు కోరారు. జీడిసిసి బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ పురపాలక సంఘ కమిషనర్ కోడూరి శివరామ ప్రసాద్, పురపాలక సంఘ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలలో ప్రత్యక్షంగా పాల్గొన్న సహకరించిన చట్టప్రకారం శిక్షలు

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వి రామకృష్ణ





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, మే 23)

బాల్యవివాహాలలో ప్రత్యక్షంగా పాల్గొన్న, సహకరించిన, వాటి నిర్వహణ చేసిన చట్టప్రకారం శిక్షలు ఉంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వి రామకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యాలయం నందు మత పెద్దలతో బాల్య వివాహాల నిర్మూలన అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తప్పును తెలిసి చేసిన, తెలియక చేసిన చట్ట ప్రకారం శిక్షార్హులేనని ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండటం ద్వారా సమాజంలో చట్టపరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవించవచ్చని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకాశం జిల్లాలో అధికంగా బాల్య వివాహాలు నమోదు అవుతున్నాయని ఈ విషయం పట్ల అధికారులు, ప్రజలు మరియు మత పెద్దలు అవగాహన కలిగి సమాజంలో తమ దగ్గరికి వచ్చే ప్రజలకు అవగాహన కలిగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవ స్వామి గుడి అర్చకులు రాంబాబు, శ్రీధర్, ముస్లిం మత పెద్దలు జిలాని, ఖాదర్ బాషా, క్రైస్తవ మత పెద్దలు జెర్మియా, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, మే 23)

మండల కేంద్రమైన ఉలవపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా శనివారం విద్యార్థులతో ముందుగా పుస్తక పఠనం చేపించి అనంతరం పిల్లలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసే క్రమంలో వారికి యోగా క్లాసు నిర్వహించడం జరిగినది. ఈ యోగా క్లాసును ఎంతో అనుభవం కలిగిన చాకిచర్ల ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఓగుబోయిన శ్రీను ప్రత్యేకమైన శ్రద్ధతో విద్యార్థులు సులువుగా అర్థం చేసుకునే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. పిల్లలు కూడా ఆసక్తిగా ఎంతో ఇష్టంతో క్రమశిక్షణగా యోగా క్లాసును ఎంజాయ్ చేశారు. అడగగానే వచ్చి యోగా క్లాసు తీసుకున్న ఫిజికల్ డైరెక్టర్ శ్రీనుకి గ్రంథ పాలకుడు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు శాంతి నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ బాపూజీ స్నాక్స్, శీతల పానీయాలు అందించి పిల్లల ప్రేమకు పాత్రులైనారు. వారికి గ్రంథ పాలకుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి 42 మంది విద్యార్థులు హాజరైనట్లు గ్రంథాలయ పాలకుడు డి కోటేశ్వరరావు తెలియజేశారు.





# వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా గుర్రంపాటి రమణారెడ్డి నియామకం





(షణ్ముఖ వెలుగు, బద్వేల్, మే 23)

బద్వేల్ మున్సిపాలిటీ పరిధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుర్రంపాటి రమణారెడ్డి పార్టీకి సుదీర్ఘకాలంగా అందించిన విశేష సేవలకు తగిన గుర్తింపు లభించింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైయస్సార్సీపి విద్యార్థి విభాగం కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, సిఫార్సులు, సూచనల మేరకు గుర్రంపాటి రమణారెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా నియమించారు. ఎఈ సందర్భంగా శనివారం బద్వేల్‌లో గుర్రంపాటి రమణారెడ్డిని మాజీ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, ప్రముఖ నాయకులు పశీగా చెన్నకృష్ణారెడ్డి, పుత్త శ్రీరాములు, వేముల సుబ్బరాజా తదితరులు శాలువాలు కప్పి, పూలమాలలతో అత్యంత ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమితులైన గుర్రంపాటి రమణారెడ్డి మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాల పట్ల ఉన్న నమ్మకంతో ఒక సామాన్య కార్యకర్తగా తాను చేసిన సేవలను గుర్తించి, నేడు నాకు ఇంతటి ఉన్నతమైన రాష్ట్ర స్థాయి పదవిని కట్టబెట్టడం నా అదృష్టంగా భావిస్తునానన్నారు. ఈ పదవి తన పై నమ్మకంతో పాటు బాధ్యతను కూడా

### రమణారెడ్డిని ఘనంగా సత్కరించిన మున్సిపల్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేతలు

### నమ్మకాన్ని నిలబెట్టుకుని, స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయానికి శ్రమిస్తా గుర్రంపాటి రమణారెడ్డి

మరింత పెంచింది. తన నియామకానికి సహకరించి, తన పై నమ్మకం ఉంచిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి కి తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో తన శక్త్యాయుధాల రాత్రింబగళ్లు శ్రమించి పార్టీ బలోపేతానికి, విజయానికి కృషి చేస్తాను. బద్వేల్ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను మరింత ఎత్తులో ఎగరేయడమే నా లక్ష్యమని అత్యంత ఆత్మవిశ్వాసంతో ప్రకటించారు. అనంతరం సత్కరించిన నాయకులు మాట్లాడుతూ రమణారెడ్డి పార్టీ కోసం నిరంతరం కష్టపడే వ్యక్తి అని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి, ప్రజాసేవలో ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రమణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.